# గ్రామ సంగ్రామం

మొన్నీమధ్య ఒక పార్టీకి వెళ్ళినప్పుడు కలిశాను రాహిల్ నాన్నగారు రామనాథంగారిని. రాహిల్ తెలుగువాడే తెలుగు పేరు కాకుండా ఉత్తర భారత ప్రభావితంతో పెట్టుకున్న పేరది.

రామనాథంగారు మాటల మధ్యలో అన్నారు, 'టెక్సాస్ రాజధాని హ్యూస్టన్ చాల బాగుంది' అని.

'అయ్యా! టెక్సాస్‌కి రాజధాని హ్యూస్టన్ కాదు. మా ఆస్టిన్' అన్నాను.

'హ్యూస్టన్ కన్నా పెద్దదా మీ ఆస్టిన్' అని అడిగాడు.

'కాదు. హ్యూస్టన్ పెద్ద నగరం. అమెరికాలో న్యూయార్కు లాస్ ఏంజలెస్ చికాగోల తర్వాత ఇదే పెద్ద నగరం. అంటే అమెరికాలో నాలుగవ పెద్ద నగరం. టెక్సాస్‌లో మా ఆస్టిన్ కన్నా హ్యూస్టన్ ఒకటే కాదు, డల్లాస్, శానాంటోనియో, ఫోర్ట్‌వర్త్ ఎంతో పెద్ద నగరాలు'

ఆయన ఆశ్చర్యంతో అన్నాడు 'అదేమిటి మరింత చిన్న వూరు ఇంత పెద్ద రాష్ట్రానికి రాజధాని ఎలా అయింది' అని.

'ఇక్కడ ఏవో కొద్ది రాష్ట్రాల్లో తప్ప అన్ని రాష్ట్రాల్లోనూ ఇంతే. అభివృద్ధి అంతా ఒకే పెద్ద వూళ్ళో వుండకుండా చూడటానికి ఇదో పద్ధతి. కాలిఫోర్నియా రాష్ట్రంలో లాస్ ఏంజలెస్, శాన్‌డియాగో, శాన్‌ఫ్రాన్సిస్కో, శాన్ హోసే లాంటి ఎంతో పెద్ద పెద్ద నగరాలు వున్నా, వారి రాజధాని శాక్రిమాంటో అనే చిన్న వూరు'

'గమ్మత్తుగావుందే న్యూయార్కు రాష్ట్రానికి పెద్దదయినా న్యూయార్కు నగరమే రాజధానా?' అన్నాడు.

నేను నవ్వి 'కాదు. న్యూయార్క్ రాష్ట్రానికి ఆల్బనీ అని ఒక చిన్న వూరు రాజధాని. న్యూయార్కు నగరం కాదు' అన్నాను.

ఆయన తన ఆశ్చర్యాన్ని కాసేపు గట్టు మీద పెట్టేసి సాలోచనగా అన్నాడు, 'అవును. అలా చేయటంలో చాల అర్థంవుంది. అంతేకాదు పెద్ద నగరాలకే కాక, అది రాష్ట్రంలో మిగతా చిన్న ఊళ్ళకీ లాభం. ఎన్నో వూళ్ళు ప్రగతిపథంలో పాలు పంచుకోవటానికి అవకాశం వుంటుంది'

'అవును. మంచి పాయింటు చెప్పారు. రాష్ట్ర రాజధాని ప్రభుత్వ కార్యాల

యాలతో, ఉద్యోగులతో, రాజకీయనాయకులతో, సందడిగా వుంటే, మిగతా వూళ్ళు పారిశ్రామికంగా ముందుకిపోవచ్చు' అన్నాను.

ఆయన అన్నాడు, 'అవును. నేను చెప్పేది అదే ఉదాహరణకి మన ఆంధ్రానే తీసుకోండి. దాదాపు నలభై ఏళ్ళనించీ అన్నీ హైదరబాద్‌కే కేటాయించారు. పారిశ్రామికంగానూ, వ్యాపార నిమిత్తంగానూ, ప్రభుత్వపరంగానూ. ఫలితం చూశారుగా. తెలంగాణాలోనూ, రాయలసీమలోనూ, కోస్తా ఆంధ్రలోనూ ఎక్కడ వేసిన గొంగళ్ళు అక్కడే వున్నాయి. విశాఖపట్నం కొంత ఫరవాలేదు కానీ ఏలూరు, తెనాలి, కాకినాడ, కరీంనగర్, మహబూబ్‌నగర్, కడప, కర్నూలులాటి వూళ్ళన్నీ అలాగే వున్నాయి. గుంటూరు, విజయవాడలాటి వూళ్ళు జనాభా అవసరాలకొద్దీ పెరిగాయి కానీ, ప్రభుత్వం పారిశ్రామికంగా ఏమాత్రం సహాయం అందించలేదు. అందుకే అవకాశాల కోసం అందరూ హైదరాబాద్‌కి ఎగబడుతున్నారు. వాళ్ళ తప్పూ ఏమీలేదు మరి. ఇలా ఒక పక్క చిన్న వూళ్ళు నష్టపోతుంటే, రెండో పక్క హైదరాబాద్ జనాభా పెరిగినంత త్వరగా, ఇళ్ళూ రోడ్లూ నీళ్ళూ కరెంటూలాటి ఉపకరణాలు పెరగక పోవటంతో అక్కడి ప్రజలు బాగా ఇబ్బంది పడిపోతున్నారు. అర్థంపర్థం లేని ఆ ట్రాఫిక్, పొల్యూషన్, పారిశ్రామిక పొల్యూషన్, దుమ్మూ ధూళి, కొట్టివేసిన చెట్లు, మురికి నీళ్ళు అక్కడ ఆరోగ్యంగా బ్రతకటమే కష్టతరం చేస్తున్నాయి'

హైదరాబాద్‌నించీ వచ్చిన మనిషే చెబుతున్నాడు కనుక ఆయన తెలిసే మాట్లాడుతుంటాడని విని వూరుకున్నాను.

వాసు అన్నాడు, 'నాటి గాంధీ నెహ్రూలనించీ ఈనాటి దాకా అందరూ చెప్పేదదేగా, పల్లెల సంగతి పట్టించుకోమని. మనవాళ్ళేమో పట్టించుకోమని అంటున్నారు. అందుకేకదా తెలుగుదేశం పార్టీ మొన్న ఎలక్షన్లలో తుడిచి పెట్టుకు పోయింది'

ఏమో... నాకు ఆ రాజకీయాల్లో నిజానిజాలు సరిగ్గా తెలీదు కనుక, అతని శబ్దచమత్కారాన్ని మెచ్చుకుంటూ నవ్వి వూరుకున్నాను.

0 0 0

అమెరికా ఈ రోజుల్లో ఎక్కువ ఔట్‌సోర్సింగ్ చేస్తున్నదని మనకందరికీ తెలుసు. ఔట్‌సోర్సింగ్‌వల్ల లాభాలు చైనా కొరియా తైవాన్‌లాటి దేశాలేకాక ఇండియా కూడా రుచి చూస్తున్నది. ఆ రుచుల గురించి కూడా మనం ఇప్పటికి నాలుసార్లు నాలుగు రుచులుగా చెప్పుకున్నాం. ఇంకో రెండుసార్లు చెప్పుకుంటే (త్వరలో చెప్ప బోతున్నాను కూడాను) అవి షడ్రుచులవుతాయి. మనం ఈ లాభాలను చూస్తుంటే అమెరికాలో కొంతమంది ఎన్నో నష్టాలని చూస్తున్నారు. వాటిల్లో ముఖ్యమైనది అమెరికాలోని ఉద్యోగాలు, ఖర్చు తక్కువ అనే పేరుతో విదేశాలకి వెడుతున్నాయని. వాటిని విమానమెక్కకుండా ఆపి, అమెరికాలోనే వుంచటమెలా అనే చర్చ చాలచోట్ల చాలసార్లు జరుగుతూనే వుంది. ఈ సందర్భంలో చిన్నచిన్న వూళ్ళు, పెద్ద పెద్ద అవకాశాలకు ఆశాజ్యోతులు వెగించాయి. అవెలాగో చూద్దాం.

0 0 0

కాథీ వైట్ అనే ఒకావిడ ఆర్కెన్సాస్ రాష్ట్రంలోని జోన్స్‌బరో అనే పల్లెటూళ్ళో రూరల్ సోర్సింగ్ ఇన్కార్పొరేటెడ్ అనే ఒక కంపెనీ స్థాపించింది.

ఒక పెద్ద కంపెనీలో చీఫ్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్‌గా చేస్తున్నప్పుడు ఆవిడకి వచ్చిన ఊహని కలగా మార్చుకుని, దాన్ని అతి త్వరగా ఆచరణలో పెట్టింది. ఆ బుల్లి వూరు ఒక మంచి కాలేజీ వున్న ఓ చిన్నవూరికి పక్కనే వుంది. మరి బుల్లి వూరు కనుక ఇళ్ళూ, ఆహారం... అన్ని ఖర్చులూ అక్కడ బుల్లివే. అదీకాక చక్కటి పైరు భూములూ, కొండలూ, కోనలూ, వాగులూ బహు బాగు బాగు. ఇటు ప్రకృతి అందాల పరవశం. అటు తక్కువ ఖర్చుల సంబరం.

రూరల్ సోర్సింగ్ అంటే - పల్లెకు పోదాం ప్రొగ్రామింగ్ చేద్దాం అని.

ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. అమెరికాలో చాలమందికి పల్లెటూళ్ళల్లో వుండటం ఇష్టం. ఏ చికాగోల వంటి పెద్ద వూళ్ళల్లో ఉద్యోగం చేస్తున్నా, ఆ చికాగోల గోలకి చికాకు పడి చుట్టుపక్కల పల్లెల్లో వుంటూ, రోజూ పెద్ద నగరాలకి వెళ్ళే వాళ్ళు ఎంతోమంది వున్నారు. ఆదాయం తక్కువయినా ఖర్చు తక్కువ కనుకా, పల్లెల జీవితం ఇష్టపడతారు కనుకా - సర్వే జనా సుఖినోభవంతు.

ఆ సూత్రం ఆధారంగా కాథీగారి కంపెనీ ప్రారంభింపబడి మూడు పువ్వులూ ఆరు కాయలుగా వృద్ధి చెందుతున్నది. ఆవిడ ఇంకా కొన్ని బ్రాంచిలని న్యూమెక్సికో రాష్ట్రంలోని పోర్ట్ ఏల్స్‌లోనూ, ఇప్పుడు నార్త్ కారొలీనా రాష్ట్రంలోని ర్యాలీ దగ్గర గ్రీన్‌విల్‌లోనూ మొదలుపెట్టింది. నగరాల్లో సంవత్సరానికి 60 వేల డాలర్ల ఉద్యోగస్థులకి, ఇక్కడ ముప్ఫై వేలు మాత్రమే ఇస్తారు. కానీ అన్ని ఖర్చులూ తక్కువే అవటం వల్ల, భలే మంచి చౌక బేరమూ అని ముందుకు వస్తున్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇండియాకో చైనాకో పంపిస్తే అమెరికాలో అయే ఖర్చులో దాదాపు ఐదవ వంతు ఖర్చుతో చేయవచ్చు. కానీ ఎంత పల్లెటూర్లకి వెళ్ళినా అమెరికాలో అంత తక్కువ ఖర్చుతో చేయటం చాల కష్టం. మరి ఎందుకీ రూరల్ సోర్సింగ్?

ఈ రూరల్ సోర్సింగ్ వృద్ధి చెందటానికి చాల కారణాలు వున్నాయి. ఒకటి, అమెరికన్ ఉద్యోగాలు అమెరికాలోనే వుంటాయి. రెండు, ఇటువంటి కంపెనీలకి ప్రభుత్వ టాక్స్ రాయితీలు లభించే అవకాశం వుంది. మూడు, రాజకీయపరంగా ఆ కంపెనీలకి పరపతి పెరిగే అవకాశం వుంది. నాలుగు, నగరాలకి పోవటానికి ఇష్టపడని కొంతమంది ఉద్యోగులకి ఇదో చక్కటి అవకాశం. ఐదు, పల్లెలు ప్రగతిపథంలో ముందుకి పోవటానికి ఇదొక మంచి మార్గం.

మరి పల్లెకు పోదాం పనులు చేద్దాం అనుకోవటంలో తప్పేముంది!

అయితే పల్లెల్లో ఉపకరణాలు ఎలా వున్నాయి. నీళ్ళు, కరెంటూ, రోడ్లూ ఫోన్లూ... అమెరికాలో వాటికేమీ ఇబ్బంది లేదు. ఏది వున్నా లేకపోయినా ప్రజలకు ప్రభుత్వం అందించేదీ అదే, అలా చేయకపోతే ప్రజలు అడిగి చేయించుకునేదీ అదే అందులోనూ ఇప్పుడు హై స్పీడ్ ఇంటర్నెట్, సెల్ ఫోన్లూ దేశంలో ప్రతి మారుమూల ప్రదేశాల్లోనూ వున్నప్పుడు ఇక ఆటంకమేముంటుంది?

O O O